సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు

మహా శివరాత్రి వేడుకలకు ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో



మూఢనమ్మకాలు వద్దు

గిరిజనులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. 8లో

కనిష్ట ఉష్ణోగ్రతల నమోదు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 6.3 డిగ్రీలు, అరకులోయలో 8.9 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 11డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు బుధవారం నమోదయ్యాయి. పలు ప్రాంతాల్లో పొగమంచు కురుస్తుండగా, ఉదయం 8గంటలకే సూర్యోదయం అవుతోంది.

న్యూస్‌రీల్

ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

- చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ కిషోర్



చింతపల్లి రూరల్: ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చింతపల్లి ఏఎస్పీ కె. ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ యువకులకు ఫార్మా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారన్నారు. గతంలో గిరిజన యువతీ, యువకులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, హైదరాబాద్ పరిధి ఫార్మా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఉద్యోగాలకు 18 నుంచి 23 మధ్య వయసు గల బీఎస్సీ కెమిస్ట్రీ, డిప్లమో ఎలక్ట్రికల్, మెకానికల్ చదివిన యువకులు మాత్రమే అర్హులని ఆయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 100 రోజులు ఉచిత భోజన, వసతి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు సమీప పోలీసుస్టేషన్‌లో పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

గైనిక్ విభాగాధిపతిగా నర్సింగరావు నియామకం



సాక్షి,పాడేరు: ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావును కాంట్రాక్టు పద్ధతిలో పాడేరు జిల్లా ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ప్రభుత్వం నియమించింది. గైనిక్ విభాగాధిపతిగా డాక్టర్ నర్సింగరావు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఏడాది పాటు పనిచేసే విధంగా వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గైనిక్ వైద్యంలో పేరొందిన ఆయన ప్రభుత్వ అనుమతితో ఇటీవల పాడేరు జిల్లా ఆస్పత్రిలో గైనిక్ ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డితో పాటు ఉన్నతాధికారుల అభినందనలు పొందారు. జిల్లా ఆస్పత్రిలో తోటి గిరిజనులకు వైద్యం అందించేందుకు కొంతకాలం పనిచేయాలని ఆయన నిర్ణయించుకున్నారు.

వినియోగదారుల సదస్సు రేపు

విశాఖలీగల్: వినియోగదారుల సదస్సు ఈ నెల 17న నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా వినియోదారుల న్యాయస్థానం-2 న్యాయమూర్తి గేదెల వేంకటేశ్వరి తెలిపారు. మారుతున్న చట్టాలు, సాంకేతికత, వినియోగదారుల హక్కులు వంటి అంశాలను ఈ సదస్సులో వివరిస్తారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, సీనియర్ న్యాయవాదులు, వినియోగదారుల సేవా సంఘాల ప్రతినిధులు, అధికారులు సదస్సులో పాల్గొంటారని న్యాయమూర్తి చెప్పారు.

సిండికేట్ మాయాజాలం

ఎంతో కష్టపడి అటవీ ఉత్పత్తులు సేకరిస్తున్న గిరి రైతుల కష్టం దళారుల పాలవుతోంది. మండలంలో కాశీపట్నం, డముకు వారపు సంతలకు చింతపండును తీసుకువచ్చిన వారికి ఇదే పరిస్థితి ఎదురైంది. దళారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గించేయడంతో ఎంతో ఆశతో మార్కెట్‌కు వచ్చిన వారికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. దళారుల నిర్ణయించిన ధరకే అమ్మాల్సి వచ్చింది.

- చింతపండుకు గిట్టుబాటు కరువు
- ధర తగ్గించేసిన దళారులు
- గతేడాది కిలో రూ.60.. ఈఏడాది రూ.30
- వారు నిర్ణయించిన ధరకే అమ్మాల్సిన పరిస్థితి
- కాశీపట్నం, డముకు సంతల్లో దందా



కాశీపట్నంలో వారపు సంతకు గిరిజనులు తీసుకువచ్చిన చింతపండు

అనంతగిరి: అటవీ ఉత్పత్తుల్లో ఒక్కటైన చింతపండును సేకరిస్తున్న గిరి రైతులకు మార్కెట్ పరిస్థితులు నిరాశ పరుస్తున్నాయి. సీజన్ ప్రారంభంలోనే దళారులు సిండికేట్‌గా ఏర్పడి ధర పెరగనీయకుండా చేయడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో ప్రతీ బుధవారం కాశీపట్నం, డముకులో వారపు సంతలు జరుగుతుంటాయి. కాశీపట్నం సంతకు ఎస్‌ఆర్‌పురం, భీంపోల్, గుమ్మకోట, చిలకల గెడ్డ పంచాయతీలకు చెందిన సుమారు 25 గ్రామాల గిరిజనులు అటవీ ఉత్పత్తులు తీసుకు వస్తుంటారు. డముకు సంతపై పరిసర ప్రాంతాలకు చెందిన గుమ్మ, పెద్దబిడ్డ, వాలాసి పరిధిలోని సుమారు 20 గ్రామాల గిరి రైతులు ఆధారపడుతుంటారు. సీజన్ వారీగా లభ్యమయ్యే అటవీ ఉత్పత్తులను ఇక్కడికి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు.

సగానికి తగ్గిన ధర

మన్యంలోని వారపు సంతల్లో చింతపండుకు రికార్డు స్థాయిలో ధర లభించింది. కిలో రూ.40 నుంచి రూ.60 వరకు కొనుగోలు చేయడంతో మంచి ఆదాయం పొందారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే చింతపండు ధర నిరాశపరిచింది. కాశీపట్నం వారపు సంతలో రూ.30 నుంచి రూ.35కు, డముకు వారపు సంతలో రూ.30 నుంచి రూ.35కు కొనుగోలు చేశారు. ఎన్నడూ లేనివిధంగా ధర తగ్గిపోవడంతో ఆదాయం కోల్పోయామని గిరి రైతులు వాపోయారు.

దళారులు నిర్ణయించిన ధరకే..

కాశీపట్నం, డముకు వారపు సంతల్లో వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారారు. గిరి రైతులు గిట్టుబాటు ధర లేకుండా చేయడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. దళారులంతా ఏకమై ఒకే ధర నిర్ణయించారు. దీంతో తీసుకువచ్చిన చింతపండుకు వెనక్కి తీసుకువెళ్లే వీలు లేక వారు నిర్ణయించిన ధరకే విక్రయించాల్సి వచ్చిందని గిరిజనులు వాపోయారు.

తూకంలోనూ మోసం..

ఒకపక్క ధర తగ్గించేసిన దళారులు మరోపక్క తూకంలో అక్రమాలకు పాల్పడుతున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. అటవీ ఉత్పత్తులు విక్రయించే వారపు సంతల్లో గిట్టుబాటు ధర వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ ఏడాది గిరిజన సహకార సంస్థ కిలో చింతపండు గతేడాది ధర రూ.32.42కు కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది ధర నిర్ణయించాల్సి ఉందని జీసీసీ అధికార వర్గాలు తెలిపాయి.

ధర తగ్గించేశారు



దళారులు సిండికేట్‌గా మారి కాశీపట్నం, డముకు వారపు సంతల్లో చింతపండు ధర తగ్గించేశారు. కొనేవారు లేకపోవడంతో వారు నిర్ణయించిన ధరకే విక్రయించాల్సి వచ్చింది. సీజన్ ప్రారంభంలో మంచి ధర రావాలి. అలాంటిది గతేడాది లభించిన ధరలో సగం మాత్రమే రావడం బాధ కలిగించింది. అధికారులు దృష్టి పెట్టి దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి.

– తమ్మయ్య, గిరి రైతు, తట్టవలస, అనంతగిరి మండలం

న్యాయం చేయాలి



గతేడాది గిట్టుబాటు ధర లభించింది. ఈ ఏడాది కూడా మంచి ధరే వస్తాది అని ఆశించాం. అయితే దళారులు తీవ్రంగా నష్టపరిచారు. వారు లాభపడ్డారు. గతేడాది లభించిన ధరకన్నా దాదాపుగా సగం తగ్గించేశారు. సీజన్ ప్రారంభంలోనే నిరాశ ఎదురైంది. మద్దతు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

– సాగరి కలిమ్మ, తుమ్మలవలస, అనంతగిరి మండలం

విద్యా విధానం ఆదర్శనీయం

- విద్య పరిశోధన శిక్షణ సంస్థ కోఆర్డినేటర్ రాంకిషోర్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న బృందం సభ్యులు

అరకులోయ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా విధానం ఆదర్శనీయమని విద్యపరిశోధన శిక్షణ సంస్థ న్యూఢిల్లీ బృందం కోఆర్డినేటర్ రాంకిషోర్ పేర్కొన్నారు. మండలంలో రెండో రోజు బుధవారం బృందం సభ్యులు మండలంలోని యండపల్లివలస కస్తూర్బాగాంధీ, సుంకరమెట్ట మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాల బోధన, విధి విధానాలు ఎంతో మెరుగ్గ ఉన్నాయన్నారు. విద్యార్థులకు డిజిటల్ బోధన అందించేందుకు పంపిణీ చేసిన జగనన్న ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. ఎక్కడా లేనివిధంగా నాడు–నేడు పథకంలో పాఠశాలలను తీర్చిదిద్ది ఆహ్లాదకర వాతావరణం కల్పించారన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇటువంటి సౌకర్యాలు, పథకాలు ఏర్పాటు చేస్తే విద్యావ్యవస్థ మరింత పటిష్ట మవుతుందన్నారు. బృందం సభ్యులు పాడేరు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. హెచ్‌ఎం జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగరాజు, రజిని,మేరి, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- దాహార్తి తీర్చేందుకు నీటికుంటలు
- డీఎఫ్‌వో (స్క్వాడ్) త్రిమూర్తులరెడ్డి



ఉర్లాకులపాడులోని సెంట్రల్ నర్సరీని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో త్రిమూర్తులరెడ్డి

రాజవొమ్మంగి: వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు డీఎఫ్‌వో (ఫ్లయింగ్ స్క్వాడ్) త్రిమూర్తులరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన రాజవొమ్మంగి అటవీక్షేత్ర కార్యాలయానికి విచ్చేశారు. ఉర్లకులపాడులోని సెంట్రల్ నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వన్యప్రాణులు ఎప్పుడైనా జనావసాల్లోకి వస్తే వాటిని రక్షించి అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవిలో అడవి జంతువుల దాహార్తి తీర్చేందుకు రక్షిత అటవీ ప్రాంతంలో నీటి కుంటలు ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ సంరక్షణలో అల్లూరి జిల్లాను ఆరు డివిజన్లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆరుగురు డీఎఫ్‌వోలను నియమించిందన్నారు. తన పరిధిలోని ఉమ్మడిగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల్లో 200 హెక్టార్లలో టేకు, ఇతర మారుజాతి వనాలను పెంచుతున్నట్టు తెలిపారు. ఈ ఏడాది ఇంత వరకు అపరాధ రుసుంగా రూ. 50 లక్షలు వసూలైందని చెప్పారు. అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్స్ ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. కార్చిచ్చులు వ్యాపించకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారన్నారు. అడవుల్లో ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా నిమిషాల వ్యవధిలోనే సమాచారం చేరవేసే వ్యవస్థ అటవీశాఖకు ఉందన్నారు. అతి పెద్ద అగ్నిప్రమాదాలు సంభవించిన సందర్భంలో సంఘటన స్థలానికి అగ్నిమాపక యంత్రాలు పంపిస్తామని చెప్పారు. కొండపోడు, అటవీహక్కుల చట్టం పేరుతో ఎవరైనా అడ్డగోలుగా ఐదు ఎకరాలు, 10 ఎకరాలు అటవీ భూభాగాన్ని ఆక్రమించుకుంటే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన అటవీహక్కు ప్రతంలో పొందు పరచిన విస్తీర్ణం మేరకే లబ్ధిదారు వ్యవసాయం చేసుకొని జీవించాలని సూచించారు. స్థానిక అటవీక్షేత్రాధికారి అబ్బాయిదొర, డీఆర్వో సోమరాజు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యాల కల్పనే లక్ష్యం





సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, హాజరైన పలుశాఖల అధికారులు

- గ్రామ సచివాలయాల సమయపాలన తప్పనిసరి
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

సాక్షి,పాడేరు: అన్ని గిరిజన గ్రామాల్లో గిరిజనులకు తాగునీటి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో పలుశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షించారు. పాడేరు డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాలలోను వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన పనులన్నీ వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. తాగునీటి పథకాల నిర్మాణాల డేటా ఎంపీడీవోల వద్ద ఉండాలని, తద్వారా ఆయా పనులను పర్యవేక్షించాలని సూచించారు. విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుని తాగు నీటి పథకాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఏజెన్సీలోని పక్కా భవనాలకు అనుమతులు తీసుకోవాలని, తర్వాత ఇంటి, ఆస్తి పన్నులు వసూలు చేయాలన్నారు. పన్నుల వసూళ్లలో అవినీతికి తావులేకుండా ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెన్‌కో అధికారులు రూ.11లక్షల పన్నులు చెల్లించాలని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వారికి నోటీసులు జారీ చేయాలని, చట్టప్రకారం పన్నులు వసూలు చేయాలని సూచించారు. సచివాలయాల ఉద్యోగులంతా సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, ముఖ హాజరును నిర్లక్ష్యం చేస్తున్నారని, వారికి జీతాలు నిలిపివేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. పంచాయతీలు, గిరిజన గ్రామాలు, సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలలు.ఆరోగ్య కేంద్రాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు రూపొందించిన ఫార్మెట్‌లో సమగ్ర వివరాలు నివేదించాలని ఎంపీడీవోలకు సూచించారు. మహిళా పోలీసులు సచివాలయాలకు రావాలని, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా పోలీసులతో ఎంపీడీవోలు సమావేశాలు నిర్వహించాలన్నారు.

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ మాట్లాడుతూ తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని, ఆయా పథకాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీవాస్తవ, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం డీఈ లీలాకృష్ణ, డీపీవో కొండలరావు, డీఎల్పీవో కుమార్, విద్యుత్ పంపిణీ సంస్థ ఈఈ అప్పారావు ,డీఈఈలు భాస్కరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పట్టభద్రుల' నామినేషన్ల స్వీకరణ

- ఇప్పటికే నామినేషన్ పత్రాలు తీసుకున్న 12 మంది
- తొలి నామినేషన్ వేయనున్న ప్రజాసంఘాల ఉమ్మడి అభ్యర్థి
- ఈ ఎన్నికకు వైట్ కలర్ బ్యాలెట్ పేపర్ కేటాయింపు
- ఉద్యోగులకు సెలవులు రద్దు



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్



నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విశాఖ డీఆర్వో శ్రీనివాసమూర్తి

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు తీసుకునేందుకు గడువు సమయంగా విధించిన నేపథ్యంలో కలెక్టరేట్ పరిధిలో 100 మీటర్ల వరకూ 144 సెక్షన్ విధించారు. నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్(ఎన్‌ఐసీ)ని హెల్ప్‌డెస్క్‌గా ఏర్పాటు చేశారు. అభ్యర్థులు, బలపరచనున్న వ్యక్తులు ఈ హెల్ప్‌డెస్క్‌లో నామినేషన్లకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకొని.. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ డా.మల్లికార్జునకు అందజేయనున్నారు. అభ్యర్థులు, వారి వెనుక వచ్చే వారు నిరీక్షించేందుకు సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 23వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇప్పటికే 12 మంది నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. సెలవు రోజుల మినహా మిగిలిన రోజుల్లో నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించారు. నామినేషన్లకు వచ్చే అభ్యర్థుల చర్యలను పర్యవేక్షించడంతో పాటు ఎన్నికల సంఘానికి పంపించేందుకు వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు కూడా చేశారు. దీనికి సంబంధించి కలెక్టరేట్ నుంచి మోనటరింగ్ వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు డీఆర్‌వో వెల్లడించారు. మరోవైపు.. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలపై చీఫ్ ఎలక్టోరల్ కార్యాలయ అధికారులు డీఆర్‌వో, పోలింగ్ సిబ్బందికి వర్చువల్ విధానంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్, రెవెన్యూ పరిధిలో ఉన్న ఉద్యోగులకు అత్యవసర మినహా సెలవులు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

బ్యాలెట్‌పై అభ్యర్థి పేరు, ఫొటో, పార్టీ పేరు

పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి తెల్ల రంగు బ్యాలెట్ పేపర్‌ని ముద్రిస్తారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లు వరుస క్రమం జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, ఇండిపెండెంట్స్ క్రమంలో ఆల్ఫాబెట్స్ ఆధారంగా ముద్రిస్తారు. బ్యాలెట్ పేపర్‌పై సీరియల్ నంబర్ తర్వాత అభ్యర్థి పేరు బ్రాకెట్‌లో బలపరిచిన పార్టీ పేరు, ఫొటో ముద్రిస్తారు. చివరి కాలమ్‌లో అభ్యర్థిని బలపరిచే ప్రాధాన్యత సంఖ్యని ఓటరు వేసే విధంగా ఉంచేలా ముద్రిస్తారు.

ఇప్పటివరకు 2.87 లక్షల పైచిలుకు ఓటర్లున్నట్లుగా గుర్తించారు. మరికొన్ని దరఖాస్తులు ఇంకా పరిశీలనలో ఉన్నాయి.

ముహూర్తం చూసుకుంటున్న అభ్యర్థులు

ఇప్పటికే ప్రచారంలో తలమునకలై ఉన్న అభ్యర్థులు నామినేషన్ల పర్వం ప్రారంభమైన నేపథ్యంలో దానికి సంబంధించిన ఏర్పాట్లుపై ప్రధాన దృష్టిసారించారు. మంచి ముహూర్తాల కోసం వెతుకులాట ప్రారంభించారు. తమ పేరు, జాతకరీత్యా కలిసొచ్చే ముహూర్తం వేటలో ఉన్నారు. 23వ తేదీ వరకు సమయం ఉండటంతో వారం వర్జ్యం చూసుకుంటున్నారు. మరోవైపు.. తొలిరోజునే మొదటి నామినేషన్ వేసేందుకు ప్రజాసంఘాల ఉమ్మడి అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ సిద్ధమయ్యారు. ఉదయం 11 గంటలకు ర్యాలీగా బయలుదేరి నామినేషన్ వేయనున్నారు.

11 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు

జీవీఎంసీ పరిధిలో ఉన్న 8 జోనల్ కార్యాలయాలకు సంబంధించిన జోనల్ కమిషనర్లకు ఎన్నికల ప్రవర్తన నియమావళి పరిశీలకులుగా నియమించారు. అదేవిధంగా 11 మంది తహసీల్దార్లను ఫ్లయింగ్ స్క్వాడ్స్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి తహసీల్దారుతో ఒక వీడియోగ్రాఫర్ కూడా ఉంటారు. నామినేషన్లు వేసే అభ్యర్థుల సంఖ్యను బట్టి ఫ్లయింగ్‌స్క్వాడ్స్‌ని పెంచే అవకాశం ఉందని డీఆర్‌వో తెలిపారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్

- డీఆర్వో అంబేద్కర్



సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం జారీ కానున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్ తెలిపారు. నోటిఫికేషన్ జారీ అయిన రోజు నుంచి ఈనెల 23వతేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, 24వతేదీన నామినేషన్ల పరిశీలన అనంతరం 27వతేదీవరకు నామినేషన్ల ఉప సంహరణకు తుది గడువు ఉందన్నారు. మార్చి 13వ తేదీన పోలింగ్ నిర్వహించి, 16వతేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో 11, 571 మంది ఓటర్లు నమోదయ్యారని, 15పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.జిల్లాలో 26మంది నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, మండల స్థాయిలో ఎంపీడీవోలు పనిచేస్తారని ఆయన వివరించారు. అన్ని విభాగాలకు జిల్లా అధికారులను నియమించారని ఆయన తెలిపారు.

మన్యంకొండ జాతరకు విస్తృత ఏర్పాట్లు

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- అధికారులతో సమీక్ష



సమీక్షిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

చింతూరు: పొల్లూరు జలపాతం వద్ద ఈనెల 27న జరిగే మన్యంకొండ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలని చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లకు సంబంధించి బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మల్కనగిరి ఐటీడీఏ పీవో త్రినాథ్ మజ్జితో కలసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు ఇరు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు హాజరయ్యే అవకాశముందన్నారు. జాతర ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. జాతరకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులకు గురికాకుండా ముందుగానే తగిన సౌకర్యాలు కల్పించాలని, భోజన వసతి, తాగునీరు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులు తరలి వచ్చేందుకు రహదారులు శుభ్రంగా ఉంచాలని, దారిలో ముళ్లపొదలు తొలగించాలని, పారిశుధ్య కార్యక్రమాలు, వైద్యశిబిరాలు, భద్రత పరమైన చర్యలు చేపట్టాలని పీవో ఆదేశించారు. జాతర ఏర్పాట్లపై ఇరు రాష్ట్రాల అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చి పుచ్చుకోవడంతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతర విజయవంతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో సాయిబాబా, కలిమెల బీడీవో ఉమాశంకర్, తహసీల్దార్ సమీర్, చింతూరు తహసీల్దార్ సాయికృష్ణ, ఎంపీడీవో రవిబాబు, జెన్‌కో ఏడీఈ కొండబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి పీవీటీజీల సమస్యలు

- భారత గిరిజన మినిస్ట్రీ సెక్రటరీ సుజిత్‌కుమార్



పీవీటీజీ గిరిజనులతో మాట్లాడుతున్న అధ్యయన బృందం సభ్యులు

అనంతగిరి: ఏజెన్సీలోని పీవీటీజీ గిరిజనుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని భారత గిరిజన మినిస్ట్రీ సెక్రటరీ సుజిత్‌కుమార్ తెలిపారు. మండలంలోని చిలకగెడ్డ పంచాయతీ మెట్టపాలెం పీవీటీజీ గిరిజన గ్రామంలో బుధవారం అధ్యయన బృందం సభ్యులతో ఆయన పర్యటించారు. వారికి గిరిజనులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. వారితో బృందం సభ్యులు సమావేశమయ్యారు. పీవీటీజీ గిరిజనుల జీవన విధానం, స్థితిగతులు, ఆచార కట్టుబాట్లు తదితర అంశాల వివరాలను తెలుసుకున్నారు. సుమారు 75 ఏళ్ల గడుస్తున్నా తాటిపూడి జలాశయంలో భూములు కోల్పోయిన తమకు నేటికి బోట్లు అందజేయలేదని, రోడ్డు, తాగునీరు, గృహాలు తదితర సమస్యలను గ్రామానికి చెందిన శోభ మధు, స్థానిక గిరిజను లు అధ్యయన బృందం దృష్టికి తీసుకువెళ్లారు. ఐటీడీఏ పీవీటీజీ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పడవ మునిగి ఒకరి మృతి



మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తీసుకెళ్తున్న దృశ్యం

మోతుగూడెం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులోని స్పిల్వే గ్రామానికి చెందిన ఘశిరామ్ ఖిల్(60) నాటు పడవలో చేపల వేటుకు వెళ్లి మునిగిపోయాడు. బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు ఘశిరామ్ ఖిల్ తన రోజూలాగా పడవలో సీలేరు నదిలో చేపల వేటకు వెళ్లగా, అకస్మాత్తుగా పడవ బోల్తా పడడంతో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని ఘశిరామ్ మృతదేహాన్ని వెలికితీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ పర్యటన నేడు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీచేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గురువారం అరకులోయ, పాడేరు నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. ఉదయం అరకులోయలో, మధ్యాహ్నం పాడేరులోను పార్టీ నేతలతో ఆయన సమావేశమవుతారు.

మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు



గొబ్బిలమడుగులో శివాలయం



మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్న శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

- ముస్తాబవుతున్న ఆలయాలు
- సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం, తిరువీధి ఊరేగింపు

కూనవరం: మహా శివరాత్రి వేడుకలకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా కూనవరం మండలంలోని కుమారస్వామి గుట్టపైన పవిత్ర గోదావరి నదీ తీరాన కొలువుదీరిన వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ప్రాంగణం చలువ పందిళ్లతో ముస్తాబైంది. శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణాన్ని ఆదివారం తెల్లవారుజామున నిర్వహించనున్నారు.

వేడుక ప్రత్యేకతలు

ఏటా మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయంలో క్యూకడతారు. పవిత్ర గోదావరి తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున తిరునాళ్ల జరుగుతాయి. భక్తులు రాత్రంతా జాగారం చేస్తూ దుకాణాల చుట్టూ కలియ తిరుగుతూ వారికి నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తూ సందడి చేస్తారు. ఈ ఆలయం పూర్తి ఏజన్సీ ప్రాంతంలో ఉన్న నాలుగు మండలాల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

ఏర్పాట్లు పూర్తయ్యాయి

మహాశివరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు ఇతరత్రా సదుపాయాలన్నీ కల్పించామని ఉత్సవ కమిటీ చైర్మన్ చిలకం హరనాథ్ చెప్పారు. స్వామి వారి దర్శనానికి భక్తులకు ఇబ్బందులు లేకుండా చలవ పందిళ్లు, బాడికేడ్లు ఏర్పాటుచేశామన్నారు. శని, ఆదివారం రోజుల్లో జరిగే వేడుకలను తిలకించేందుకు ఏర్పాట్లు పూర్తయినట్టు తెలిపారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్త్ ఏర్పాటు చేశామని ఎస్ఐ బి.వెంకటేష్ తెలిపారు. ఇప్పటికే చింతూరు ఏఎస్పీ మహేశ్వర రెడ్డి ఈ ఆలయాన్ని ఒకసారి సందర్శించారని, బుధవారం ఎటపాక సీఐ గజేంద్ర కుమారు వచ్చి పరిస్థితులను పరిశీలించనట్టు చెప్పారు.

గొబ్బిలమడుగులో...

రాజవొమ్మంగి: మండలంలోని గొబ్బిలమడుగు గ్రామంలోని గంగా వారాహి సమేత మధుకేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు చేశారు.గ్రామంలోని కొండపై బండరాళ్ల నడుమ జలపాతం వద్ద ఈ లింగాన్ని ప్రతిష్ఠించారు. సర్పంచ్ సవిరెల చంద్రుడు, వైస్ సర్పంచ్ రమాదేవితో పాటు ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకుంటాం



బొడ్డాపుట్టులో ఘటన స్థలంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: మృతి చెందిన విద్యార్థిని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, బాధితులకు తగిన న్యాయం చేస్తామని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హామీ ఇచ్చారు. మండలంలోని తాడిపుట్టు పంచాయతీ ఉ్రరాడ బొడ్డాపుట్టు గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ నేపథ్యంలో విద్యుత్ స్తంభం పడి విద్యార్థి మృతి చెందిన విషయంపై ఆ గ్రామంలో చేరుకుని విద్యార్థిని కుటుంబాలను పరామర్శించారు. పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థిని మృతి చెందిందని, వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే పాల్గుణ ఫోన్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడి సంఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పరంగా రావల్సిన సాయాన్ని తక్షణమే అందించాలని కోరారు. దీనిపై కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడుతూ ఇద్దరు ఉపాధ్యాయులపై ఎంఈవోపై చర్యలు తీసుకుంటామని, ముందస్తు తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి రూ.50 వేలు అందిస్తామని తెలిపారు. విద్యార్థిని మృతి చాలా బాధకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు ఎటువంటి సాయం అవసరమైనా వెంటనే సంప్రదించాలని ఎమ్మెల్యే పాల్గుణ కోరారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, మండల గౌరవ అధ్యక్షుడు చినసత్యం, సర్పంచ్‌లు సోమెలి సత్యవతి, సమిడ వెంకటపూర్ణిమ, ధనసాని సత్యవతి, ఎంపీటీసీ సభ్యుడు సింహాచలం తదితరులున్నారు.

పారదర్శకంగా సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపిక

- అంతర జిల్లా పోటీలకు 20 మంది క్రీడాకారుల ఎంపిక
- 19 నుంచి 21 వరకు అనంతపురం జిల్లాలో పోటీలు



సెపక్ తక్రా ఉమ్మడి విశాఖ జట్ల క్రీడాకారులతో ఉపాధ్యాయులు, పీడీలు

దేవరాపల్లి: ఉమ్మడి విశాఖపట్నం స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెపక్ తక్రా జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ మండలంలోని పెదనందిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పారదర్శకంగా జరిగింది. ఈ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను స్థానిక పేరెంట్స్ కమిటీ చైర్మన్ సిహెచ్.అప్పలనాయుడు, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం పి. శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్(ఎస్‌జీఎఫ్) సెక్రటరీ ఎ. శేఖర్, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సెక్రటరీ బి.కిరణ్‌కుమార్, స్థానిక వ్యాయమ ఉపాధ్యాయులు టి.నాగేశ్వరరావు, ఎస్. గోవింద, రావూస్ అకాడమి డైరెక్టర్ అప్పారావు తదితర్లు ప్రారంభించారు. ఈ ఎంపికకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుండి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్–14, అండర్–17 విభాగాలలో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జట్టుకు ఐదుగురు చొప్పున రెండు విభాగాలలో 20 బాలబాలికలను ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన క్రీడాకారులు ఈ నెల 19 నుండి 21 వరకు అనంతరంపురం జిల్లా ఉరవకొండ మండలం అమిద్యాల జెడ్పీ హైస్కూల్లో జరిగే అంతర జిల్లా సెపక్ తక్రా పోటీలలో పాల్గొంటారన్నా రు. అనంతరం స్థానిక హెచ్‌ఎం పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇటువంటి క్రీడాకారుల ఎంపిక చేపట్టడం ద్వారా విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి, ఉత్సాహం పెరుగుతుందన్నారు.

బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుల నియామకం



ఎస్.ఎం.ఎస్. కుమార్



ఎ.ఆర్.వి.ఎల్ నారాయణ



పి.ఎస్. గజపతిరాజు

పాయకరావుపేట : ఆంధ్ర యూనివర్సిటీ కంప్యూటర్స్ డిపార్ట్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యులుగా స్థానిక శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు ఎస్.ఎం.ఎస్.కుమార్, ఏఆర్‌వీఎల్ నారాయణ, పి.ఎస్.గజపతిరాజు నియమితులైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీర్రాజు తెలియజేశారు. వీరు 2023 నుండి 2026 వరకు ఆంధ్ర విశ్వ విద్యాలయం బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా కొనసాగుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని కళాశాల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు అభినందించారు.

శతాధిక వృద్ధుడు అప్పలనాయుడు మృతి



అప్పలనాయుడు(ఫైల్)

మునగపాక : మండలంలోని చూచుకొండ గ్రామంలో శతాధిక వృద్ధుడు పెంటకోట అప్పలనాయుడు(101) బుధవారం మృతి చెందారు.గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అప్పలనాయుడు మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలముకుంది. అప్పలనాయుడుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అప్పలనాయుడు అంత్యక్రియలు స్వగ్రామం చూచుకొండలో నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

యువకుని హత్య కేసులో నిందితుడి లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన సీఐ నారాయణరావు



విలేకరులకు నిందితుడి వివరాలు తెలుపుతున్న సీఐ నారాయణరావు

ఎస్.రాయవరం : పెదగుమ్ములూరు మద్యం దుకాణం వద్ద రెండు రోజుల క్రితం యువకుడు ప్రవీణ్‌కుమార్‌ను హత్య చేసిన నిందితుడు చొప్పా రమణ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడని నక్కపల్లి సీఐ నారాయణరావు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. మృతుడి తల్లి దంటు సత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తాము చేసిన విచారణలో పలు విషయాలు తెలిశాయన్నారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు చొప్పా రమణ, హత్యకు గురైన ప్రవీణ్‌కుమార్ కొంతకాలంగా కొరుప్రోలు కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రవీణ్‌కుమార్ చొప్పా రమణ కుమార్తెను ప్రేమిస్తున్నానని వెంటపడేవాడు. ఈ విషయం తెలిసి చొప్పా రమణ ప్రవీణ్ కుమార్‌ను తీవ్రంగా హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో రమణకు వేరే మహిళతో అక్రమ సంబంధం ఉన్నట్టు రమణ భార్యకు ప్రవీణ్‌కుమార్ చెప్పాడు.

దీంతో కక్ష పెంచుకున్న రమణ తన కూతురి జీవితంతో పాటు తన కాపురంలోనూ చిచ్చుపెట్టిన ప్రవీణ్‌కుమార్‌ను అంతమొందించాలని నిర్ణయించుకుని సోమవారం రాత్రి పెదగుమ్ములూరు మద్యం దుకాణం వద్ద పథకం ప్రకారం కాపు కాశాడు. తనతో తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా ప్రవీణ్ కుమార్‌ను నరికి చంపి పారిపోయాడు. నిందితుడు లొంగిపోయి నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ చెప్పారు.

600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



బెల్లం పులుపును పారబోస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కె.కోటపాడు : గవరపాలెం గ్రామంలో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎ.కోడూరు పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. సారా తయారీ జరుగుతుందన్న ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలను నిర్వహించారు. గ్రామానికి చెందిన శివారు ప్రాంతంలో నాటుసారా తయారీకి డ్రమ్ములలో సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లంపులుపును గుర్తించారు. ఈ పులుపును సిబ్బందితో కలిసి ఎస్ఐ రామకృష్ణ ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ చట్టరీత్యా నేరమని, సారా తయారీకి పాల్పడితే చట్టపరమైన చర్యలను తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఆయన వెంట కానిస్టేబుల్ మూర్తి పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరిస్తాం



విద్యార్థులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ గెద్ద ఉమ, ఆర్‌జేడీ జ్యోతికుమారి

ఎస్.రాయవరం: లింగరాజుపాలెంలో మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థుల సమస్యల పరిశీలనకు బుధవారం సాయంత్రం మహిళా కమిషన్ సభ్యులు గెద్దం ఉమ, ఆర్‌జేడీ జ్యోతికుమారి, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీపతి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్యామ్, ఎంఈవో మూర్తి, ఉపవిద్యాశాఖాధికారి ఒకరి తరువాత ఒకరు పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఇబ్బందులు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాచారం తెలియడంతో అధికారులు పరుగు పెట్టారు. ఈ మేరకు గెద్దం ఉమ విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్న తాత్కాలిక భవనం తుఫాన్ రక్షిత భవనమని, పూర్తి స్థాయిలో భవనం లేక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రాష్ట్ర కమిషనర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి త్వరలో అన్ని సదుపాయాలు ఉన్న భవనంలోనికి విద్యార్థులను మార్చేలా చేస్తామన్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యను పరిష్కారం చేశారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్యామ్ అన్నారు. శాశ్వత భవనం నిర్మాణానికి స్థల కేటాయింపుపై దృష్టి సారిస్తామన్నారు.

లోవ తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



ఆలయంలో బార్‌కేడ్లు, రక్షణ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి

రావికమతం: ఈ నెల 18 నుంచి 3 రోజుల పాటు జరిగే కళ్యాణపులోవ తిరునాళ్లకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా ఎస్పీ గౌతమి సాలి బుధవారం పరిశీలించారు. ఆ మూడు రోజుల్లో లక్షల సంఖ్యలో యాత్రికులు వస్తారు. ఆర్టీసీ 80 వరకూ ప్రత్యేక సర్వీసులు నడపనున్న దృష్ట్యా తగిన ట్రాఫిక్ ఏర్పాట్లు, రక్షణ ఏర్పాట్లు గూర్చి ఎండోమెంటు అధికారులు, ఆలయ ట్రస్టు బోర్డు, స్థానిక ప్రజా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాలు జరుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తిరునాళ్ల విజయవంతం చేయాలన్నారు. అడుగడుగునా బందోబస్తు ఉంచాలని స్థానిక సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్‌ను ఆమె ఆదేశించారు.

మూఢనమ్మకాలు వద్దు

కొయ్యూరు: గిరిజనులు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. అశాస్త్రీయమైన చెడుపు, చిల్లంగి వంటివి నమ్మవద్దన్నారు. బూదరాళ్ల పంచాయతీ గిరిమండల, పిట్లపాడు, వంతమర్రి, కన్నవరం, నేరేడుబంద, అన్నవరం, గొర్రెలమెట్ట గ్రామాలను ఆయన బుధవారం సందర్శించారు. గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శివ కిషోర్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమన్నారు. ఎవరూ చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడొద్దన్నారు. పిల్లలను బాగా చదివించి భవిష్యత్ బాటలు వేయాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ స్వామినాయుడు, ఎస్ఐ లోకేష్‌కుమార్ ఉన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో కలలు సాకారం

- సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యండమూరి

కశింకోట : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో తమ లక్ష్యాలను సాధించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ప్రముఖ నవలా రచయిత, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత యండమూరి వీరేంద్రనాథ్ సూచించారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో 'విజయ మార్గానికి సోపానాలు' అనే అంశంపై విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు భయాన్ని వీడి, ధైర్యంతో విజయ లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా విధానాన్ని పెంపొందించే విధంగా పలు ప్రశ్నలు అడిగి ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల తరపున యండమూరికి దుశ్శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

రొయ్యల ఎగుమతికి లైన్‌క్లియర్

- కొన్నాళ్లుగా విశాఖ విమానాశ్రయంలో నిలిచిన ఎయిర్ కార్గో
- తాజాగా సరకు రవాణాకు అనుమతులు ఇచ్చిన బీసీఏఎస్



ఎయిర్‌పోర్టులో కార్గో రవాణా దృశ్యం (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎట్టకేలకు రొయ్య పిల్లల రవాణాకు అనుమతులు లభించాయి. విమానాశ్రయాల్లో నిర్దేశిత నిపుణులైన స్క్రీనర్లు లేని కారణంగా విశాఖ, విజయవాడ సహా దేశంలోని తొమ్మిది ఎయిర్‌పోర్టుల్లో జనవరి ఒకటి నుంచి ఎయిర్ కార్గో రవాణాకు బ్రేకులు పడ్డాయి. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) సరకు రవాణాను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇన్నాళ్లూ ఆయా విమానయాన సంస్థలే కార్గో స్క్రీనింగ్ వ్యవహారాలు చూసుకునేవి. ఇటీవల ఆ బాధ్యతలను బీసీఏఎస్ పర్యవేక్షిస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా విమానాశ్రయాల్లో బీసీఏఎస్ నిబంధనలకనుగుణంగా నియమితులైన స్క్రీనర్లతోనే సరకు తనిఖీలు చేపట్టడం తప్పనిసరి చేసింది. వీటిని ఇప్పటికీ అమలు చేయని విమానాశ్రయాల్లో కార్గో బుకింగ్, రవాణాను నిలిపివేస్తూ బీసీఏఎస్ నిర్ణయం తీసుకుంది. గతంలో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి స్పైస్ జెట్ సంస్థ ప్రత్యేకంగా ఒక కార్గో విమానాన్ని నడిపేది. కోవిడ్ ప్రభావంతో దానిని రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు నుంచి సరకు రవాణాకు ప్రత్యేకంగా కార్గో విమానాలు నడవడం లేదు. పాసింజరు విమానాల్లో కేటాయించిన మేరకు వివిధ ప్రాంతాలకు కార్గో రవాణా జరుగుతోంది. కాగా నిలిచిపోయిన కార్గో రవాణాను తక్షణమే పునరుద్ధరించాలంటూ విమానయాన సంస్థలు, ఎయిర్‌పోర్టు అధికారులు బీసీఏఎస్‌ను ఎవరి స్థాయిలో కోరుతున్నారు.

రొయ్యల రవాణాకు లైన్‌క్లియర్

విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోజుకు 80 వరకు పౌర విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి ద్వారా నెలకు సగటున 300 టన్నుల సరకు రవాణా జరుగుతోంది. వీటిలో వైద్య పరికరాలు, అత్యవసర మందులు, రక్త పరీక్షల నమూనాలు, ఫార్మా, మత్స్య ఉత్పత్తులు, టెక్స్‌టైల్ వంటివి ఉన్నాయి.

45 రోజులుగా ఈ విమానాశ్రయం నుంచి కార్గో రవాణా నిలిచిపోవడంతో సంబంధీకులు రోడ్డు, రైలు మార్గాల్లో తమ సరకు/ఉత్పత్తులను పంపిస్తున్నారు. మరీ అత్యవసరమైతే తేలికైన వస్తువులు, సరకులు, మందులు, రక్త నమూనాలు వంటి వాటిని విమాన టిక్కెట్టు బుక్ చేసుకుని తమ వెంట తీసుకెళ్లి వస్తున్నారు. ఇలా రవాణా చేసే సమయంలో ఆక్సిజన్ సరిగా అందక పెద్ద ఎత్తున రొయ్య పిల్లలు చనిపోతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా విశాఖ విమానాశ్రయం నుంచి రొయ్య పిల్లలను కార్గో ద్వారా రవాణా/ఎగుమతులకు అనుమతులిస్తూ పౌర విమానయానశాఖ జాయింట్ డైరెక్టర్ అవధేష్ ప్రతాప్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రక్షణరంగ ఉత్పత్తుల రవాణాకు బీసీఏఎస్ అనుమతించిందని, తాజాగా రొయ్య పిల్లల (ష్రింప్ సీడ్) రవాణాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని విశాఖ విమానాశ్రయం డైరెక్టర్ కె. శ్రీనివాసరావు 'సాక్షి'తో చెప్పారు.